సాక్షి
నిజామాబాద్
బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



పగలు డంప్.. రాత్రి జంప్

ఇసుక దందాకు కేరాఫ్ అడ్రస్‌గా భీమ్‌గల్ నిలుస్తోందనే ఆరోపణలున్నాయి. కప్పలవాగు, పెద్దవాగు నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు.

- 8లో ▸



అంబేడ్కర్‌ను అవమానిస్తే..

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను ఎవరు అవమానించినా తిప్పికొడతామని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0 /25.1

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జి కుంచాల సునీత బదిలీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా జడ్జి సునీతా కుంచాల పెద్దపలి జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో హైదరాబాద్ నుంచి జీవీఎన్ భరతలక్ష్మీ రానున్నారు. అలాగే బోధన్ అదనపు జిల్లా జడ్జి రవి కుమార్ గద్వాలకు బదిలీ అయ్యారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి పర్యటన



నిజామాబాద్‌అర్బన్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.45 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే సమీక్షాసమావేశంలో మంత్రి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, సన్నబియ్యం లబ్దిదారుని ఇంటిలో భోజనం చేస్తారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో, అనంతరం మోర్తాడ్ మండల కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాల్లో జూపల్లి పాల్గొని తిరిగి హైదరాబాద్ బయల్దేరుతారు.

ఆలయ హుండీ లెక్కింపు



నిజామాబాద్ రూరల్: మండలంలోని సారంగాపూర్ హనుమాన్ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మొత్తం రూ.60,476 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు తెలిపారు. ఎండోమెంట్ పరిశీలకులు కమల, ఎస్.రాములు, శశికుమార్‌రాందాసి, ప్రశాంత్‌కుమార్, పారాయణ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బోనస్ దారి మళ్లింపుపై విచారణ

రుద్రూర్: కోటగిరి సింగిల్ విండో పరిధిలో సన్నధాన్యం బోనస్ డబ్బులు అనర్హుల ఖాతాలో జమ చేశారనే ఫిర్యాదుపై సహకార అధికారులు మంగళవారం విచారణ జరిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంబర్‌సింగ్ రాథోడ్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రియాజుద్దీన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ అలీం కోటగిరి విండోకు వచ్చి విచారణ చేపట్టి, వారం క్రితం నోటీసులు అందుకున్న వారి వివరాలు సేకరించారు. బుధవారం కూడా విచారణ కొనసాగుతుందని, అవసరమైతే రైతుల వద్ద కూడా సమాచారాన్ని సేకరిస్తామని అధికారులు వెల్లడించారు.

నేత్ర వైద్యశాలలకు నోటీసులు

నిజామాబాద్‌నాగారం: వైద్యుడు లేకున్నప్పటికీ కాంపౌండర్ కంటి పరీక్షలు చేయడం, మందుల రాయడంపై జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులకు ఫిర్యాదు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నెల 5వ తేదీన డీఎంహెచ్‌వో రాజశ్రీ ఆదేశాల మేరకు విచారణ అధికారులు డాక్టర్ సుప్రియ, వేణు తదితరులు నగరంలోని ఖలీల్‌వాడీలో ఉన్న డాక్టర్ కృష్ణమూర్తి శ్రీరామా నేత్ర వైద్యశాల, గిరిజా ఆస్పత్రిని తనిఖీలు చేసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది తప్పును అంగీకరించినట్లు సమాచారం. విచారణ నివేదికను డీఎంహెచ్‌వోకు ఈ నెల 11వ తేదీన అందడంతో రెండు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో నోటీసులకు జవాబు ఇవ్వాలని ఆదేశించారు.

రేషన్‌లో ప్లాస్టిక్ బియ్యం అవాస్తవం

సుభాష్‌నగర్: రేషన్ షాపుల్లో పంపిణీ చేసే సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని పెద్దపల్లి జిల్లాలోని తిలక్‌నగర్‌లో పంపిణీ చేసే సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలిశాయని ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలలో కొన్ని వీడియోలు ప్రచారం చేశారని, తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సన్న బియ్యం పథకంపై ప్రజలలో ఆందోళన సృష్టించేలా తప్పుడు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పక్షి వాలని చెట్టు పనికొస్తుందా..?



పక్షి వాలలేని చెట్టు పనికొస్తుందా..? అని జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రాంతాల్లో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లను చూసి ప్రజలు అంటున్నారు. కోనోకార్పస్ చెట్ల వేర్లు భూగర్భంలోకి లోతుగా చొచ్చుకెళ్లి నిర్మాణాలను, కాలువలను, పైప్‌లైన్‌లను ధ్వంసం చేస్తాయని వీటితో ఎటువంటి ఉపయోగం ఉండదంటున్నారు. కనీసం పక్షులు కూడా కోనోకార్పస్ చెట్లపై వాలే అవకాశం లేదని పేర్కొంటున్నారు. ఈ చెట్లు ఎక్కడా కనిపించకుండా తొలగించాలని అసెంబ్లీలో స్పీకర్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే కొత్త కలెక్టరేట్ ప్రాంతంలోని క్యాంపు కార్యాలయం నుంచి చుట్టు పక్కల కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగాయి. కోర్టు చౌరస్తా, కలెక్టరేట్ గ్రౌండ్‌లో, న్యాల్‌కల్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కన వరుసగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు కనిపిస్తున్నా పట్టించుకునే వారు లేకుండాపోయారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

న్యాల్‌కల్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన వరుసగా కోనోకార్పస్ చెట్లు



కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయం గోడచుట్టూ ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు





కోర్టు చౌరస్తా, కలెక్టరేట్ గ్రౌండ్‌లో..

ధాన్యం సేకరణకు హమాలీల కొరత

- బస్తాపై ఏకంగా రూ.5 వరకు పెంపు!
- రైతులపై భారం మోపుతున్న కేంద్రాల నిర్వాహకులు
- 'ఐకేపీ'కి కేంద్రాలు కేటాయించడంతోనే కొరత.. ధర పెంపునకు కారణం?



సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు హమాలీల కొరత తీవ్రంగా ఉంది. గ్రామాల్లోని ఏ కేంద్రాన్ని పరిశీలించినా హమాలీల కొరత వేధిస్తోంది. ఎండల తీవ్రత నేపథ్యంలో బీహార్, యూపీ తదితర రాష్ట్రాల నుంచి హమాలీలు పని నిమిత్తం ఇక్కడికి వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకుంటున్న దళారులు బస్తా ధర అమాంతంగా పెంచేస్తున్నారు. గతేడాది రూ.14 (ఒక్కో బస్తాకు) ఇవ్వగా, ప్రస్తుతం ధరను రూ.18 నుంచి రూ.20 వరకు పెంచేశారు. కేంద్రాల నిర్వాహకులు ఆ భారాన్ని రైతులపై వేస్తుండటంతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అయినా హమాలీల కొరత తీరడంలేదు.

పెరిగిన బస్తా ధర.. రైతులపై భారం

జిల్లాలో సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సొసైటీలు, ఐకేపీ, మెప్మా ద్వారా సేకరించాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. సొసైటీలు తీసుకొచ్చిన హమాలీలను మహిళా సంఘాల సభ్యులు అధిక డబ్బులు చెల్లించి తీసుకెళ్తుండటంతో వారికి డిమాండ్ పెరిగింది. డబ్బులు అధికంగా చెల్లిస్తామని చెప్పడంతో హమాలీలను దళారులు రాత్రికిరాత్రే మకాం మార్పించేస్తున్నారు. ఈ ప్రక్రియలో అత్యధికంగా దళారులే లాభపడుతున్నారనేది సొసైటీలు, ఐకేపీ సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. బస్తాకు ఎంత ధర చెల్లించినా.. హమాలీలకు ఇచ్చేది రూ.13 నుంచి రూ.14 వరకు మాత్రమే. ఆర్మూర్ డివిజన్‌లో కొన్ని సొసైటీలు, ఐకేపీ కేంద్రాల్లో హమాలీల కొరత కారణంగా ఒక్కో బస్తాకు రూ.18 నుంచి రూ.20 వరకు చెల్లిస్తున్నారు. గత సీజన్ కంటే ఒక్కో బస్తాపై రూ.3 సగటున పెరగడంతో జిల్లా రైతాంగంపై సుమారు రూ.6 కోట్లకుపైనే భారం పడనుంది.

2.30 లక్షల మెట్రిక్ టన్నులు..

జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు 410 కేంద్రాల ద్వారా 2.30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. అందులో 2.22 లక్షల మెట్రిక్ టన్నులు సన్నరకాలు కాగా, 8 వేలు దొడ్డు రకాలున్నాయి.

హమాలీల కొరతతో ఇబ్బందులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను హమాలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రభుత్వం ఈ సీజన్‌లో సుమారు 240 కేంద్రాలను ఐకేపీ, మెప్మా మహిళా సంఘాలకు కేటాయించింది. మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల కేటాయింపులు ఆలస్యం కావడంతో హమాలీలు, ఇతరాత్ర ఏర్పాట్లలోనూ జాప్యం జరిగింది. సొసైటీలు ఎప్పటిలాగే వారికి కేటాయించిన కేంద్రాల అవసరాలకు అనుగుణంగా హమాలీలకు దళారుల ద్వారా అడ్వాన్సులు చెల్లించి ముందస్తుగా ఏర్పాట్లు చేసుకున్నాయి. నేటికీ హమాలీల కొరత కారణంగా అనేక కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరగడం లేదని పౌర సరఫరాలశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

సుమారు 23వేల మంది రైతులు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించగా, రూ.125 కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ప్రతిపాదించిన 693 కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ.. కేవలం 410 కేంద్రాల ద్వారానే ధాన్యం సేకరిస్తున్నారు.

అధికార యంత్రాంగం చర్యలు శూన్యం

ధాన్యం కేంద్రాలకు హమాలీల కొరత ప్రభావం కొనుగోళ్లపై పడక ముందే పౌరసరఫరాలు, సహకార, డీఆర్‌డీఓ, ఇతర శాఖలు దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు. వారం, పది రోజులుగా జిల్లావ్యాప్తంగా కేంద్రాలకు హమాలీల కొరత ఉందని తెలిసినా.. అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదు. బుధవారం ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో సమీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరతపై దృష్టిసారించాలని రైతాంగం కోరుతోంది.

ముగిసిన యువవికాసం దరఖాస్తు గడువు

- ఆన్‌లైన్ దరఖాస్తులు 58,896
- ఆఫ్‌లైన్ దరఖాస్తులు 04
- అధికారులకు హార్డ్‌కాపీలను అందజేయని 40,444 మంది

నిజామాబాద్‌అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం దరఖాస్తుల గడువు సోమవారంతో ముగిసింది. ఆయా కార్పొరేషన్‌ల పరిధిలో లక్ష్యానికి మించి దరఖాస్తులు అందాయి. ఈనెల 5వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉండగా, ఆ తరువాత 14వ తేదీకి పొడిగించారు. దీంతో దరఖాస్తుల సంఖ్య పెరిగింది.

ఎంపిక చేసేది 22,285 మందిని..

ఆయా కార్పొరేషన్‌ల పరిధిలో 22,285 లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో 5817, ఎస్టీ కార్పొరేషన్‌లో 3088, బీసీ కార్పొరేషన్‌లో 7969, ఈడబ్ల్యూఎస్ 2,326, మైనారిటీ కార్పొరేషన్‌లో 2911 , క్రిస్టియన్ మైనారిటీలో 174 మంది లబ్ధిదారులను ఆయా నియోజక వర్గాల వారీగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో ఎక్కువ.. ఆఫ్ లైన్‌లో తక్కువ

ఆన్‌లైన్‌లో 58,896 మంది దరఖాస్తు చేసుకోగా, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో 18,452 మంది హార్డ్ కాపీలను అందజేశారు. ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న వారు ఇంకా 40,444 మంది తమ దరఖాస్తులను అధికారులకు అందజేయాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకుండా ఆఫ్‌లైన్‌లో అధికారులకు జిల్లా వ్యాప్తంగా కేవలం నలుగురు మాత్రమే దరఖాస్తులను అందజేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు చాలా మంది కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు ఆలస్యం కావడంతో హార్డ్‌కాపీలను సంబంధిత కార్యాలయంలో అందజేయలేదు. ఇదిలా ఉండగా అత్యంగా బీసీ కార్పొరేషన్‌కు దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. వివిధ వృత్తులు, వ్యాపారాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఎక్కువగా ఉన్నారు.



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

దరఖాస్తులు

కార్పొరేషన్	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	అధికారులకు అందినవి
ఎస్సీ	10,845	1	3,792
ఎస్టీ	4,590	-	1760
బీసీ	29,638	3	10,090
ఈబీసీ/ఈడబ్ల్యూఎస్	1317	-	305
మైనారిటీ	12253	-	2425
క్రిస్టియన్	253	-	80
మొత్తం	58,896	4	18,452

దరఖాస్తు చేసుకున్న వారు అందజేయాలి



ఈనెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు హార్డ్ కాపీలను స్థానిక ఎంపీడీవో కార్యాలయం, మున్సిపాలిటీల్లో అందజేయాలి. గడువు పొడిగింపుపై సమాచారం లేదు. – రమేశ్, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి

పింక్ బుక్ నిండాలి.. వారి పాపం పండాలి..

- కార్యకర్తలను ఇబ్బంది పెట్టే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత
- ఊరూరూ తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపు



రూరల్ సన్నాహక సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

డిచ్‌పల్లి: ఇకపై కేసీఆర్ 3.0 వర్షన్ చూస్తారని, బీఆర్ఎస్ పార్టీ మునపటి పార్టీ కాదని, అందరి లెక్కా తేలుస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులకు కొందరు పోలీసులు గు లాంగిరీ చేస్తున్నారని వారి పేర్లన్నీ పింక్ బుక్‌లో రాస్తున్నామని, పింక్ బుక్ నిండాలి.. వారి పాపం పండాలని హెచ్చరించారు. ఇకపై తాను సైలెంట్ గా ఉండనని, కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూ స్తానని హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి డిచ్‌పల్లి మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కవిత పలు వ్యాఖ్యలు చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్ ను అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రశంసించారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో అనేక సంక్లిష్ట పరిస్థితులను, ఇబ్బందులను ఎదుర్కొన్నామన్నారు. కేసీఆర్ కానీ గులాబీ జెండా కానీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల ఢిల్లీకి వెళితే మీ తెలంగాణలో 20 పర్సెంట్ సర్కారు నడుస్తుందట కదా అని అడుగుతున్నారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో చెట్లను కొట్టివేస్తే న్యూయార్క్‌లో చర్చ నడుస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ కాంప్రమైజ్ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు తెచ్చానని చెబుతున్నారు.. కానీ కేవలం గెజిట్ మాత్రమే ఇచ్చారని బోర్డుకు చట్టబద్ధత లేదన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదిస్తేనే ఏబోర్డుకైనా చట్టబద్ధత వస్తుందని, ఈ విషయమై ఎంపీ అర్వింద్ ను తాను హెచ్చరించినట్లు కవిత తెలిపారు.

2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ టికెట్ కోసం ఢిల్లీకి వెళ్లిన బాజిరెడ్డి గోవర్ధన్‌తో తాను మాట్లాడి రూరల్ ఎమ్మెల్యేగా టీఆర్ఎస్ నుంచి నిలబడేలా ఒప్పించానని తెలిపారు. కేసీఆర్ వెన్నంటి ఉండి బాజిరెడ్డి అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరురా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సక్సెస్ చేయాలని కవిత పిలుపునిచ్చారు. వరంగల్ సభ తెలంగాణ కుంభమేళాగా చరిత్రలో నిలిచిపోవాలన్నారు.

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్ హిందుత్వం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రూరల్ నియోజకవర్గానికి పట్టిన శని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అని ధ్వజమెత్తారు. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. ఇప్పుడు అదే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టమని కేసీఆర్‌ను వేడుకుంటున్నారని తెలిపారు. అయితే ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం కానీ అడ్డదారిలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోమని తమతో కేసీఆర్ చెప్పారని పేర్కొన్నారు. కేసీఆర్ స్థానంలో కవిత ఉంటే ప్రభుత్వాన్ని తప్పక పడగొట్టేదని బాజిరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇసుక, ఇటుక, మొరంతో పాటు ధాన్యం సంచుల్లో కూడా బరితెగించి అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు రూ.150 కోట్ల అభివృద్ధి పనులకు తాను జీవోలు తెచ్చానని, పాత జీవోలకు శంకుస్థాపనలు చేయడానికి భూపతిరెడ్డి సిగ్గుపడాలని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ లు ప్రసంగించారు. మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సొసైటీ చైర్మన్లు, పార్టీ మండల అధ్యక్షులు, వివిధ విభాగాల నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లి చేపలను అందించాలి

బాల్కొండ: చేప పిల్లల కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి కోసం కావాల్సిన చేప పిల్లలను చెరువుల నుంచి మత్స్యకారులు అందించాలని జిల్లా మత్స్యశాఖ ఏడీ అంజనేయస్వామి అన్నారు. మంగళవారం మెండోరా మండలం పోచంపాడ్ వద్ద గల జాతీయ చేప పిల్లల కేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుత సంవత్సరం సకాలంలో చేప పిల్లల ఉత్పత్తి చేపట్టేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. చేపపిల్లల ఉత్పత్తి కోసం తల్లి చేపల సేకరణ ప్రారంభిస్తామన్నారు. అందుకు మత్స్య సహకార సంఘాలు సహకారమందించాలన్నారు. తల్లి చేపలకు కిలోల చొప్పున ధర చెల్లిస్తామన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం నాటికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎఫ్‌డీవో దామోదర్, సిబ్బంది ఉన్నారు.



పోచంపాడ్‌లో చేప పిల్లల కేంద్రంలో ఏడీ, ఎఫ్‌డీవో

క్లుప్తంగా

పీజీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ 1, 3వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్ టీ సంపత్, పీఆర్‌వో ఏ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inలో పొందుపర్చినట్లు కంట్రోలర్ తెలిపారు.

కీ బోర్డులో గిన్నిస్ రికార్డు



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన సుభాష్‌చంద్ర బోస్ కీ బోర్డు ప్లేయింగ్‌లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. విజయవాడ కీ బోర్డు ప్లేయింగ్ అండర్ హెల్ మ్యూజిక్ స్కూల్ ఈ నెల 14న నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఈ ఘనత సాధించారు. సుభాష్ చంద్రబోస్ జిల్లాలో ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు.

అంతర్జాతీయ వర్క్‌షాప్‌కు తెయూ అధ్యాపకుడికి ఆహ్వానం



తెయూ(డిచ్‌పల్లి): దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు చెందిన హెవెన్లీ కల్చర్ వరల్డ్ పీస్ రిస్టోరేషన్ ఆఫ్ లైట్ (హెచ్‌డబ్ల్యూపీఎల్) సంస్థ 'పాత్రికేయ విద్య' అనే అంశంపై నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో పాల్గొనాల్సిందిగా తెలంగాణ యూనివర్సిటీ సోషల్ సైన్స్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్‌కు ఆహ్వానం పంపింది. వివిధ దేశాల నుంచి పలువురు ఆచార్యులు పాల్గొనే ఈ వర్క్‌షాప్ ఈ నెల 17న జరుగనుంది. వారం రోజుల ముందే ఈ ఆహ్వానం అందడంతో సమయాభావంతో సియోల్ వరకు రాలేనని, ఆన్‌లైన్‌లో హాజరై ప్రసంగించేందుకు అనుమతించాలని చంద్రశేఖర్ సంస్థ నిర్వాహకులను కోరారు. దీనికి ఆ సంస్థ ఆమోదం తెలుపడంతో ఈ నెల 17న సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు జరిగే వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఆన్‌లైన్‌లో హాజరై ప్రసంగించనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌రూరల్: జెండా బాలాజీ దేవస్థానంలో ధర్మకర్తలుగా సేవలందించేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 22వ తేదీ వరకు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

పగలు డంప్.. రాత్రి జంప్

- ఇసుక అక్రమ దందాకు కేరాఫ్‌గా భీమ్‌గల్
- కప్పలవాగు, పెద్దవాగుల నుంచి పగలు నిల్వ చేసి రాత్రి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వ్యాపారులు
- అధికారులు దాడులు చేస్తున్నా ఆగని ఇసుక రవాణా



భీమ్‌గల్‌లో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంప్

మోర్తాడ్: ఇసుక అక్రమ దందాకు కేరాఫ్ అడ్రస్‌గా భీమ్‌గల్ నిలుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని కప్పలవాగు, పెద్దవాగుల శివారు నుంచి కొందరు ఇసుకాసురులు పగటి పూట ట్రాక్టర్లతో డంప్ చేసి రాత్రిపూట పెద్ద పెద్ద లారీల్లో పొరుగు ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు దాడులు చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని చూస్తున్నా అక్రమార్కులు తమ బుద్ధి మార్చుకోవడం లేదు. తాజాగా బడాభీమ్‌గల్ శివారులోని వాగు నుంచి ఇసుకను ఒక చోట డంప్ చేయగా శనివారం అధికారులు సీజ్ చేశారు. అసలు విషయానికొస్తే కొన్ని నెలల నుంచి పగటి పూట స్థానిక అవసరాల కోసం ఇసుకను తరలించేందుకు కొందరు వ్యాపారులు అధికారుల నుంచి అనుమతి పొందుతున్నారు. తవ్విన ఇసుకను కొందరి విక్రయించి, పెద్ద మొత్తంలో నిలువ చేస్తున్నారు. ఈ నిలువలను రాత్రిపూట ఒక్కో లారీ లోడ్‌కు రూ.40వేల వరకూ వసూలు చేసుకొని తరలిస్తున్నట్లు సమాచారం.

అక్రమ దందాలో ఒక్కటైన నాయకులు

ఇసుక అక్రమ రవాణాపై ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోకూడదనే ఉద్దేశ్యంతో ఆయా గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒక్కటైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇసుక తరలించేందుకు గ్రామాభివృద్ధి కమిటీలు నిర్వహించే వేలంపాటల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు పాల్గొని తక్కువ ధరకు టెండర్ ఒకే చేసుకున్నట్లు సమాచారం. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు అడ్డు చెప్పకుండా ఉండేందుకు వారిని కూడా ఈ అక్రమ దందాలో భాగస్వాములను చేసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. బహిరంగంగా ఒక పార్టీపై మరో పార్టీ నాయకులు విమర్శలు చేసుకుంటున్నా.. అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకునే అంశంలో చేతులు కలిపినట్లు బలంగా వినిపిస్తుంది. భీమ్‌గల్ మండలంలోని వివిధ గ్రామాలలో జోరుగా ఇసుక దందా సాగడమే కాకుండా అక్రమ వ్యాపారంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కలిసిపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారని చెప్పొచ్చు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే తిప్పికొడతాం

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి
- అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ సిటీ: రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ అంబేడ్కర్‌ను ఎవరు అవమానించినా తిప్పికొడతామని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు సాక్షిగా బీజేపీ నాయకులు అంబేడ్కర్‌ను అవమానించారని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి పేరిట బీజేపీ నాయకులు తాకడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని పులాంగ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై పార్లమెంటులో హోం మంత్రి అవమానకరంగా మాట్లాడినా ప్రధాని మోదీ ఖండించలేదన్నారు. అమిత్‌షాపై చర్యలు తీసుకోలేదంటేనే బీజేపీ అంబేడ్కర్‌పై చిత్తశుద్ధి లేదని తెలుస్తోందన్నారు. హత్య చేసిన వారే సానుభూతి తెలిపినట్లు బీజేపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహాల శుద్ధి చేసే కార్యక్రమం చేపట్టారని ఎద్దేవా చేశారు. జై బాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని గ్రామగ్రామానా తీసుకెళ్లి అంబేడ్కర్ ఆశయాలను వివరిస్తామన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ ప్రపంచమంతా అంబేడ్కర్ జయంతి నిర్వహిస్తే దేశ ప్రధాని మాత్రం పార్లమెంటులో నివాళులర్పించలేదన్నారు. సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, నాయకులు రత్నాకర్, రేవతి, విపుల్ గౌడ్, వేణురాజ్, లింగం, నరేందర్, విజయ్ పాల్ రెడ్డి, కోనేరు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై భ్రమలు తొలగిపోయాయి

- ఆ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సోన్‌పేట్ మాజీ సర్పంచ్ గోలిప్రకాశ్

వేల్పూర్: కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని, అందుకే తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం సోన్‌పేట్ మాజీ సర్పంచ్ గోలిప్రకాశ్, దూదిగాం మాజీ సర్పంచ్ పసుల శ్రీనివాస్, వారి అనుచరులు వేల్పూర్‌లో మంగళవారం వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలోని మోతె, బుస్సాపూర్ లాంటి అనేక గ్రామాలు ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ ఉద్యమానికి అండగా నిలబడ్డాయన్నారు. కేసీఆర్ వెంట తన తండ్రి స్వర్గీయ వేముల సురేందర్‌రెడ్డి ఉద్యమ ప్రస్థానంలో మొదటి నుంచి నడిచారని గుర్తుచేశారు. కేసీఆర్ పదేళ్లలో తెలంగాణను అనేక రంగాలలో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చి, ప్రజలను నమ్మించి మోసం చేసి గద్దెనెక్కారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కమలాకర్, మాజీ ఎంపీటీసీ దేవేందర్, మాజీ సర్పంచులు నర్సయ్య, గంగారెడ్డి, రాజారెడ్డి, గంగారెడ్డి, యాదగిరిగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమాత్యా.. పురపాలికపై కరుణ చూపరూ?

- నేడు భీమ్‌గల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు రాక
- పట్టణాభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజల వేడుకోలు
- సమస్యల పరిష్కారానికి ఎదురుచూపులు



భీమ్‌గల్ పట్టణం

మోర్తాడ్ : భీమ్‌గల్ పట్టణానికి రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేడు(బుధవారం) రానున్నారు. పట్టణంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో పట్టణంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారిస్తారా అనే విషయంపై పుర ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణాభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

ప్రజల సమస్యలు

- మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని వార్డుల్లో మురికి కాలువల సౌకర్యం లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది.
- పున:ప్రారంభమైన బస్సు డిపోలో బస్సులు, అధికారులు, ఉద్యోగులను కేటాయించకపోవడంతో కాగితాలకే పరిమితమైంది.
- 100 పడకల ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాలేదు. త్వరగా అందుబాటులోకి తీసుకొస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయి.
- విద్యుత్ లైన్ కొత్తది వేసి సరఫరాలో లోపాలను సరిదిద్దాలి.
- తహసీల్దార్ భవనం కూల్చి ఆ స్థలాన్ని మార్కెట్ కోసం కేటాయించారు. మార్కెట్ స్థలంలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో రోడ్లపైనే కొనసాగుతోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఇలా ఎన్నో సమస్యలతో సతమతం అవుతున్న భీమ్‌గల్ పట్టణంపై మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలి

- ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్



నిజామాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజాన్ని అణచివేయడానికి దోహదపడుతుందన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో బైక్ ర్యాలీలు నిర్వహించి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. వక్ఫ్ బోర్డు నూతన బిల్లుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. సమావేశంలో వక్ఫ్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని 33/11 కేవీ వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్, 11 కేవీ పులాంగ్–1 ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తగులుతున్న లైన్లను క్లియర్ చేసేందుకు బుధవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టౌన్ ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులాంగ్, వంశీ ఇంటర్నేషనల్ హోటల్, కాకతీయ కళాశాల, దేవీ టాకీస్, నిఖిల్ సాయి, వేణు మాల్, రైతు బజార్, పాటిగల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దుబ్బ పరిధిలో సైతం..

దుబ్బ సబ్‌స్టేషన్ 11 కేవీ పీటీ–2 ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, మిర్చి కాంపౌండ్‌లోని సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లలితమహల్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–2 ఏడీఈ ఆర్ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీసీ కాలనీ, సంజీవయ్య కాలనీ, ఆదర్శ్ నగర్, దుబ్బ ఎక్స్‌రోడ్, హమాల్‌వాడీ, నాందేవ్‌వాడ, నిజాంకాలనీ, లలితామహల్ రోడ్, కొత్త గంజ్, అర్సపల్లి రోడ్ తదితర కాలనీల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు చెరువులోపడి వృద్ధుడి మృతి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ శివారులోని గుండ్ల చెరువులో ప్రమాదవశాత్తు పడి కుంట గంగా మోహన్‌రెడ్డి(65) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. మంగళవారం గుండ్ల చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లిన కుంట గంగామోహన్‌రెడ్డి ప్రమాదవశాత్తు చెరువులో పడి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. మృతుడు తెలంగాణ మలిదశ ఉద్యమంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో కలిసి పాల్గొన్నాడని స్థానికులు తెలిపారు. గంగామోహన్‌రెడ్డి అంత్యక్రియల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో రెడ్డిపేటవాసి..



రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన బట్టు సురేశ్(42) అనే వ్యక్తి దుబాయ్‌లో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఐదు నెలల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన సురేశ్‌కు ఈ నెల 12న బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే మరణించాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేశ్ మృతదేహాన్ని స్వదేశానికి పంపేందుకు దుబాయ్‌లో ఉన్న బట్టు శంకర్, నవీన్ ప్రయత్నిస్తున్నట్లు గల్ఫ్ సంఘ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గల్ఫ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండ సురేందర్‌రెడ్డి కోరారు.

అడవిపంది దాడి.. ఒకరికి గాయాలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన కొనగోళ్ల సాయిబాబా అనే వ్యక్తిపై అడవిపంది దాడి చేసినట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. సాయిబాబా తన పొలానికి వెళ్తున్న సమయంలో అడవిపంది దాడి చేయడంతో చేతు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సాయిబాబాను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పరామర్శించారు. అటవీశాఖ అధికారులు బాధితుడికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



కామారెడ్డి క్రైం: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. అతివేగంగా వచ్చిన లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని ఉగ్రవాయి మైసమ్మ స్టేజీ వద్ద కామారెడ్డి–సిరిసిల్లా ప్రధాన రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన నాగుల వినోద్ కుమార్ (30) చేపలు పట్టడం, కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. చేపల పని మీద తన స్నేహితుడు జక్కుల దేవేందర్‌తో కలిసి బైక్‌పై కామారెడ్డికి బయల్దేరారు. ఉగ్రవాయి మైసమ్మ స్టేజీ సమీపంలోకి రాగానే బైక్‌ను లారీ ఢీకొనగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే కామారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే చికిత్స పొందుతూ వినోద్ కుమార్ మృతి చెందాడు. దేవేందర్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రిఫర్ చేశారు. మృతుడి తల్లి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

దుబాయ్‌లో దారుణం

- ఇద్దరు తెలంగాణవాసుల హత్య
- జిల్లావాసికి తీవ్రగాయాలు



దేగాం సాగర్

మోర్తాడ్(బాల్కొండ): దుబాయ్‌లోని అల్‌కూజ్ ప్రాంతంలో తెలంగాణవాసుల హత్య కలకలం సృష్టించింది. గడిచిన శుక్రవారం ఈ దుర్ఘటన చోటు చేసుకోగా సామాజిక మాధ్యమాల ద్వారా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోడ్రన్ బేకరీ అనే సంస్థలో పని చేస్తున్న తెలంగాణ వాసులపై పాకిస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తి కత్తిగట్టి హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఘటనలో నిర్మల్ జిల్లా సోన్‌కు చెందిన ప్రేమ్‌సాగర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్ దుర్మరణం చెందగా, జిల్లాలోని ఆర్మూర్‌కు చెందిన దేగాం సాగర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కాగా, నిందితుడిని దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సమాచారం బయటకు రాకుండా హుకుం

బేకరీలో ఇద్దరి హత్య, ఒకరిపై హత్యాయత్నం ఘటన సమాచారాన్ని సదరు సంస్థ యాజమాన్యం అత్యంత గోప్యంగా ఉంచింది. సంస్థలో తెలంగాణ వాసులు కొందరు, పాకిస్తాన్, ఇతర దేశాలకు చెందిన వారు పనిచేస్తుండగా ఘటనకు సంబంధించిన సమాచారం బయటికి చేరవేయకూడదంటూ యాజమాన్యం కార్మికులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఇక్కడి వారికి సమాచారం తెలిసినా యూఏఈలో ప్రధానంగా దుబాయ్‌లో ఉన్న తెలుగువారికి సరైన వివరాలు తెలియకపోవడం గమనార్హం. అల్‌కూజ్‌లోని బేకరీ ప్రాంతానికి యూఏఈ మినహా ఇతర దేశాల వారిని రాకుండా కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకున్నట్లు తెలంగాణ కార్మికులు కొందరు 'సాక్షి'తో ఫోన్‌లో చెప్పారు. దుబాయ్‌లోని సమాచారాన్ని బయట ప్రపంచానికి తెలియజేసే వీలు లేదని, దుబాయ్ పోలీసులు లేదా సంస్థ యాజమాన్యం మాత్రమే ఏదైనా ప్రకటన చేయడానికి అవకాశం ఉంటుందని కార్మికులు వెల్లడించారు. ఇదిలా ఉండగా హత్యకు గురైన వారి మృతదేహాలను, గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తిని ఇంటికి తరలించే ఏర్పాట్లు చేయాలని గల్ఫ్ కార్మిక సంఘాలు కోరుతున్నాయి. దుబాయ్‌లోని భారత విదేశాంగ శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



గంగాధర్ మృతదేహం

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మంగళవారం సాయంత్రం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జిరాయత్‌నగర్‌లో నివాసముండే ఒడ్డె గంగాధర్(55) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పని నిమిత్తం ఎక్సెల్ బైక్‌పై వెళ్తున్న గంగాధర్‌ను క్లాక్ టవర్ వద్ద రెడీమిక్స్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం లారీ ఢీకొని మరొకరు..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంగ్డాపూర్ బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి ధాన్యం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మోస్రా మండలంలోని గోవూర్ గ్రామానికి చెందిన రాజాగౌడ్, లాలూ ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కందకుర్తికి వెళ్లి పెగడాపల్లి మీదుగా బోధన్‌కు తిరిగి వస్తున్నారు. బోధన్ నుంచి పెగడాపల్లి వైపు ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ లంగ్డాపూర్ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న లాలూ(43)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, రాజాగౌడ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని లాలూ మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీని అదుపులోకి తీసుకొని, మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



మాక్లూర్ : పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 13న చిక్లి గ్రామశివారులో వడ్డె చిన్న గంగాధర్ (48) అనే వ్యక్తిని ట్రాక్టర్‌తో ఢీ కొట్టి మరణానికి కారణమైన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ సీఐ బీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. చిక్లి గ్రామానికి చెందిన వడ్డె చిన్న గంగాధర్‌కు అదే గ్రామానికి చెందిన కారం నవీన్‌కు మధ్య భూ తగాదాలు ఉన్నాయి. ఈ విషయంలో విడగొట్టు ప్రసాద్ అనే వ్యక్తి కారం నవీన్‌కు మద్దతు తెలపడంతో ఈ నెల 13న సొసైటీ గోదాం వద్ద ఘర్షణ జరిగిందన్నారు. నవీన్ వ్యక్తిగత విషయాలను మృతుడు వడ్డె చిన్న గంగాధర్ బహిరంగంగా విమర్శించేవాడని తెలిపారు. ఇద్దరి మధ్య తగాదాను పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడే క్రమంలోనే చిన్న గంగాధర్‌ను నవీన్ ఉద్దేశపూర్వకంగానే ట్రాక్టర్‌తో ఢీకొట్టి మరణానికి కారణమైనట్లు పేర్కొన్నారు. విడగొట్టు ప్రసాద్‌ను ఏ–2గా చేర్చినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై శేఖర్, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

వేంకటేశ్వర ఆలయంలో చోరీ



బాల్కొండ: మండలంలోని వన్నెల్(బీ) వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. 15 రోజుల క్రితమే ఉత్సవాలు జరగడంతో భక్తులు హుండీలో అధికంగా ముడుపులు వేసినట్లు స్థానికులు తెలిపారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మహేందర్ గౌడ్‌కు చెందిన కిరాణా షాపు, నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన మోయిన్ ఖాన్ పాన్‌షాపులలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూసి ఉన్న షాపుల తాళాలు పగులకొట్టి నగదును అపహరించారని పేర్కొన్నారు. దుండగులు నస్రుల్లాబాద్‌లోని పాల కేంద్రం, కిరాణాషాపులో చోరీకి యత్నించారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాయిలర్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని సాయిరాం ఆగ్రో బాయిలర్ ఫ్యాక్టరీలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. బాయిలర్ ఫ్యాక్టరీలో బ్రిక్స్ తయారి కోసం పెద్ద మొత్తంలో సోయాబీన్, శనగ, కంది పొట్టును సేకరించారు. ఫ్యాక్టరీ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో కూలీలు, యజమానులు బయటకు పరుగులు తీశారు. మద్నూర్ అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మహారాష్ట్రలోని దెగ్లూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. రెండు ఫైరింజన్లతో సిబ్బంది మూడు గంటలపాటు కష్టపడి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

తాగి వాహనాలు నడిపిన పలువురికి జైలు

డిచ్‌పల్లి/నవీపేట/ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి సర్కిల్ పరిధిలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికిన పలువురికి జైలు శిక్ష పడినట్లు సీఐ కే మల్లేశ్ మంగళవారం తెలిపారు. రెండ్రోజుల క్రితం డిచ్‌పల్లి పీఎస్ పరిధిలో తనిఖీలు చేపట్టగా తనుగు ప్రవీణ్(ఆకుల కొండూర్), ములుగు శామ్యూల్(బర్ధిపూర్), మల్లేశ్(డిచ్‌పల్లి), గుగులోత్ మోహన్ (డీబీ తండా)లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి 2 రోజులు జైలు శిక్ష విధిస్తూ జిల్లా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం తీర్పు వెలువరించారు. ఇందల్వాయి పీఎస్ పరిధిలో దొరికిన ఐదుగురికి రూ.12 వేల జరిమానా విధించారు. జక్రాన్‌పల్లి పీఎస్ పరిధిలో సంతోష్‌నగర్ కాలనీకి చెందిన బోదాసు తిరుపతికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. నవీపేట శివారులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడ్డ అభంగపట్నం గ్రామానికి చెందిన పురం అశోక్, ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన కొండల్‌రావులకు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి నాందేవ్‌వాడకు చెందిన బత్తుల యాదగిరి, సుభాష్‌నగర్‌కు చెందిన నాగెల్లి గంగయ్యకు కోర్టు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

బోధన్‌లో ఒకరికి జైలు..మరొకరికి జరిమానా

రెంజల్(బోధన్): రెంజల్ క్రాసింగ్ వద్ద సోమవారం సాయంత్రం మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ మధుకర్ కాంబ్లేకు ఒక రోజు జైలు శిక్ష విధించగా, మరొకరికి రూ.4వేల జరిమానా విధిస్తూ బోధన్ కోర్టు అదనపు ద్వితీయశ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.